ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 20 సంచిక : 3 నవంబర్ 2014

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 12

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....
ఆగష్టు 2014
అరుణాచలం
అక్టోబర్ 2014
అరుణాచలం

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 03-10-2014, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు విజయదశమి. భారతీయ సాంప్రదాయంలో ఇది చాలా ముఖ్యమైనరోజు. విజయదశమి రోజున మనం ఏ పని ప్రారంభించినా అది సక్సెస్ అవుతుందని, అది సుఖాంతం అవుతుందని చెపుతారు. ఉన్నది ఒక్కటే వస్తువు, అదే బ్రహ్మం. దానిని ఎవరూ కాదనకండి. ఉన్నదానిని కాదనటం మంచిది కాదు. అందుచేత బ్రహ్మంను కాదని అనకండి. బ్రహ్మంను స్మరించండి, బ్రహ్మంను ధ్యానించండి. మీకు ఉన్న కోరికలు అన్నీ నెరవేరతాయి. మీకు కావలసిన వన్నీ బ్రహ్మం ఏర్పాటు చేస్తుంది. బ్రహ్మం అంటే ఒక వ్యక్తికాదు. మీకు, నాకు, సమస్తదేవతలకు, పంచభూతాలకు అన్నింటికీ ఆధారమైనదే బ్రహ్మం. అదే సుఖం, అదే శాంతి, అదే ఆనందం, అదే ఉండటం. దానికి చావుపుట్టుకలతో సంబంధం లేదు. దేనిమీద ఆధారపడి మనందరం జీవిస్తున్నామో అదే బ్రహ్మం. అది లేదని అనవద్దు. ఉన్నవస్తువును ఉన్నట్లుగా మీరు అంగీకరించ లేకపోయినా అది లేదని మాత్రం అనవద్దు. బ్రహ్మమును మీరు కాదనకండి. మీరు ఎవరికయినా రవికలగుడ్డ యిస్తూఉంటే వారు వద్దు అంటే మీరు ఏమంటారు అలా అనకూడదండి, కాదనకండి అంటారు కదా, అలాగే బ్రహ్మమును మీరు కాదనకండి అని చెపుతున్నారు. నిరంతరం బ్రహ్మంను స్మరించండి, బ్రహ్మమును ధ్యానించండి, సత్కర్మను నిష్కామంగా చేయండి, సమస్త జీవకోటి పట్ల సమానభావం కలిగి ఉండటం, వారి క్షేమంకోరుకోవటం ఇలా జీవించటం వలన మనస్సు నిర్మలమవుతుంది, మనస్సుకు పవిత్రత వస్తుంది, మనస్సుకు లోచూపు కలుగుతుంది. అప్పుడు మనస్సు అంతర్ముఖమయి, హృదయంలో అది స్థిరపడినప్పుడు మనస్సు నెమ్మదిగా

నశిస్తుంది, అప్పుడు అక్కడ ఉన్న బ్రహ్మం నీకు వ్యక్తమవుతుంది.

**లభన్తే బ్రహ్మ నిర్వాణం ఋషయః క్షీణకల్మషాః**
**ఛిన్నద్వైదా యతాత్మనః సర్వభూతహితేరతాః**

పాపరహితులును, సంశయములు లేనివారును, ఇంద్రియాలను మనస్సును స్వాధీనపరచుకొన్నవారును, సమస్త ప్రాణకోటి యొక్క క్షేమమును కోరేవారునగు ఋషులు బ్రహ్మసాక్షాత్కారమును పొందుచున్నారు. సర్వభూతహితేరతాః యిది ఒక మంత్రం అనుకోండి. సర్వభూతహితేరతాః అంటే సమస్త జీవకోటి యొక్క క్షేమం కోరమని యిక్కడ భగవంతుడి ఉవాచ. అలా కోరుకోవటంలో కూడా మనకు తెలియకుండ మనకు ఆధ్యాత్మిక అభివృద్ధి వస్తుంది. మన మనస్సు పల్చబడుతుంది, మనస్సుకు మెచ్యూరిటీ వస్తుంది, పరిశీలనాశక్తి పెరుగుతుంది. ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలంటే ఏకాగ్రత పెంచుకోవాలి, పరిశీలనా శక్తి పెంచుకోవాలి. అందరి క్షేమాన్ని, అందరి ఆనందాన్ని నువ్వు కోరుకో. అందరి క్షేమాన్ని కోరుకొంటూ ఉంటే, యితరుల అభివృద్ధి కోసం నువ్వు ఎంతో కొంత చెయ్యగలిగిన పని చేస్తూ ఉంటే అటువంటి వ్యక్తులు బ్రహ్మనిర్వాణాన్ని పొందుతారు. కర్మను కర్మకిందకాకుండా కర్మను యోగంగా చేయటం వలన నువ్వు బ్రహ్మనిర్వాణమును పొందుతావు. అంటే బ్రహ్మానందమును పొందుతావు.

నేను చాలాకాలంనుండి సాధన చేస్తున్నాను. హృదయంలో ఏదో ఉంది అని చెపుతున్నారు. ఆ ఉన్నదానిని నేను నమ్ముతున్నాను. నేను చాలాకాలం నుండి సాధన చేస్తున్నప్పటికీ దాని టచ్ నాకు దొరకటంలేదు, నాచేతికి అందటంలేదు, పోనీ మనస్సుకు అందుతుందా అంటే మనస్సుకు అందటం లేదు. దీనికి కారణం ఏమిటి అని ఒక డాక్టరుగారు అడుగుతున్నారు. "నేను అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నాను అని పరమాత్మ చెప్పాడు. అదే బ్రహ్మపదార్థం, అది ఒక్కటే నిజం. ఈ గుడులు, గోపురాలు, పుణ్యాలు, పాపాలు, స్వర్గాలు, నరకాలు ఇవి అన్నీ మనస్సు కల్పించినవే. హృదయంలో ఉన్న బ్రహ్మపదార్థం అది ఒక్కటే నిజం. డాక్టరుగారు మీరు మంచిగానే చూస్తున్నారు, దేనిని తెలుసుకోవాలో అక్కడే మనస్సు పెడుతున్నారు అక్కడివరకు బాగానే ఉంది కాని మీకు బ్రహ్మం తెలియబడదు ఎందుచేతనంటే అది ఎంత పవిత్రంగా ఉందో, ఎంత నిర్మలంగా ఉందో, ఎంత ఏకాగ్రంగా ఉందో అలా మీరు ఉండగలుగుతున్నారా?" అని అడిగాను. 'అంతలా నేను ఉండలేక పోతున్నాను' అని చెప్పారు. "అయితే బ్రహ్మం మీకు తెలియబడదు" అని చెప్పాను. బ్రహ్మం ఎంత స్వచ్ఛంగా ఉందో, ఎంత నిదానంగా ఉందో, ఎంత పవిత్రంగా ఉందో, ఎంత ఏకాగ్రంగా ఉందో, ఎలా ఒకటిగా ఉందో అలా మీరు ఉండగలిగితే, బ్రహ్మం హృదయంలో ఎంత సహజంగా ఉందో, మీ మనస్సు కూడా అంత సహజంగా అక్కడ ఉండగలిగితే అప్పడు అది మీకు

తెలియబడుతుంది లేకపోతే తెలియబడదు. బ్రహ్మపదార్థాన్ని తెలుసుకోవటానికి మీ లోపల ఏవైతే ఆటంకాలుగా ఉన్నాయో వాటినన్నింటిని తొలగించుకొంటూరావాలి. మీ మనస్సు పక్వానికి రావాలి. ఇన్నిరకాలుగా ఉంటేకాని మీ మనస్సు బ్రహ్మాకారం చెందదు. మీలోపల బ్రహ్మం ఉందని తెలిసినంతమాత్రంచేత అది తెలియబడదు. లోపల ఉందని తెలియటం మంచిదే. దానిని తెలుసుకోవాలి అనే కోరిక మీకు ఉంటే ఎప్పటికైనా అది మీకు తెలియబడుతుంది. రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు వస్తాయి. మీకు బ్రహ్మంను తెలుసుకోవాలి అని ఉంది కాని ఆ బ్రహ్మం కూడా మీకు తెలియబడాలి అని అనుకొంటేనే కాని అది తెలియబడదు. ఇదీ రహస్యం. ఏ వస్తువునైతే మీరు తెలుసుకోవాలి అనుకొంటున్నారో అది కూడా మీకు తెలియబడాలి అనుకొన్నప్పుడు మాత్రమే తెలియబడుతుంది కాని మామూలు పరిస్థితులలో మీకు తెలుసుకోవాలని ఉన్నా అది తెలియబడదు.

మనం పని చేస్తాము. ఆశ లేకపోతే ఫలితం రాదేమో అనుకొంటాము. మనకు ఆశ ఉండాలి, ఆశ లేకపోతే మన కోరిక ఎలా నెరవేరుతుంది అనుకొంటాము. ఆశతో పనిచేస్తే ఒకవేళ మీ కోరిక నెరవేరవచ్చు. ఆశ లేకుండా పనిచేయటం వలన రెండు లాభాలు ఉన్నాయి. ఆశ లేకుండా పని చేయటం వలన కోరిక నెరవేరుతుంది, దాని వలన నీకు చిత్తశుద్ధి కలుగుతుంది. అంటే మీకు పనీ అయిపోతుంది, బ్రహ్మం తెలియబడుతుంది. ఇది రహస్యం. ప్రపంచంలో ఇంతవరకు ఏ స్వార్థపరుడికీ బ్రహ్మం తెలియబడలేదు. నువ్వు ఎందుకు మాట్లాడుతున్నావు, ఎందుకు పని చేస్తున్నావు. దీనికంతా బ్రహ్మం సాక్షిగా ఉంటుంది. అంటే బ్రహ్మంకు తెలియకుండా మనం ఏ పని చేయలేము. ఈ సృష్టికంతా ఆధారంగా ఉన్నది బ్రహ్మమే. బ్రహ్మపదార్థాన్ని తెలుసుకోవాలి అంటే చిత్తశుద్ధి ఉండాలి. చిత్తశుద్ధి కావాలి అంటే ఆశ లేకుండా పని చెయ్యాలి. ఏమండీ ఆశ లేకుండా ఎలా పనిచేస్తాము, అది సాధ్యమా అనవచ్చు. చాలామంది అభిప్రాయం ఏమిటి అంటే ఆశ లేకుండా పనిచేస్తే ఫలితం రాదేమో అనుకొంటారు. విజయదశమి రోజున ఈ రెండు మాటలు మీరు గుర్తు పెట్టుకోండి. ఆశ లేకుండా పనిచేసేవాడికి ఫలితం ఎక్కువ ఉంటుంది. అది భౌతికమైన లాభం. రెండో లాభం ఏమిటి అంటే ఆశ లేకుండా పనిచేసే వాడికి చిత్తశుద్ధి వస్తుంది. చిత్తశుద్ధి అనే గేటుద్వారానే బ్రహ్మంలో ప్రవేశించాలి కాని ఇంకో మార్గంలేదు.

ఈ శరీరం ఏదో రోజు చనిపోతుంది. దానికి చనిపోయేరోజు వచ్చినా శరీరం చనిపోవటానికి అహంకారం ఒప్పుకోదు. శరీరం ముసలిది అయిపోయింది, చావటానికి సిద్ధంగా ఉంది. అప్పుడైనా చనిపోవటానికి అహంకారం ఒప్పుకోవాలి కదా! శరీరం మీద ఉన్న మమకారం కొలది అది ఒప్పుకోదు, ఇంకా ఉండమని చెపుతుంది. శరీరం చనిపోయే

మాట వదిలేయండి. ఇప్పుడు ఈ శరీరం ఉండగా శరీరాన్ని బంధించే కోరికలు ఏమున్నాయో, ఈ లోకానికి బంధించే కోరికలు ఏమున్నాయో చూసుకొని వాటిని తొలగించే ప్రయత్నం చేయాలి. మనం ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలంటే వాస్తవ పరిస్థితులు చూడాలి. ఇప్పుడు మన మనస్సు ఎలా ఉంది? మన మనస్సులో ఉన్న బలహీనతలు ఏమిటి? మన మనస్సును ఎలా శుద్ధి చేసుకోవాలి? మనస్సు యొక్క చాపల్యం ఎలా తగ్గించాలి? ఇవన్నీ ఏకాంతంగా కూర్చున్నప్పుడు జాగ్రత్తగా ఆలోచించుకొని దానికోసం ప్రయత్నం చేయాలి. మనలో రాగద్వేషాలు, అసూయ ఉంటాయికదా? అసూయవలన కూడా ఆరోగ్యం చెడిపోతుంది. మనం ఎవరిని చూసి అసూయపడుతున్నామో వాడి ఆరోగ్యం చెడదు, మన ఆరోగ్యం చెడిపోతుంది. అందుచేత ఈ దేహం భూమి మీద తిరుగాడుతున్నప్పడే మీ లోపల ఉన్న రాగద్వేషములను, అసూయను తొలగించుకోవాలి. ఈ లోకానికి ఏ విషయాలు అయితే మిమ్మల్ని బంధిస్తున్నాయో, ఈ దేహానికి ఏ విషయాలు అయితే మిమ్మల్ని బంధిస్తున్నాయో ఈ దేహం జీవించి ఉండగానే అంటే ఈ దేహం స్మశానంకు వెళ్లకముందే ఆ బలహీనతలను బయటకు లాగి కాల్చి బూడిద చేస్తేనే లోపలఉన్న బ్రహ్మపదార్థం మీకు అందుతుంది. అయితే దీనికి ధైర్యం ఉండాలి, ఎంతోకొంత చైతన్యస్థాయి ఉండాలి.

నేను ఉంటే అంతా ఉంది, నేను లేకపోతే ఏమీ లేదు. ఇది భగవాన్ మాట. దీనిని మీరు రోజు జ్ఞాపకం పెట్టుకోండి. రెండోమాట ఏమిటి అంటే మనం అది తెలుసుకోవాలి, ఇది తెలుసుకోవాలి అనుకొంటున్నాము. మీరు ఎన్ని తెలుసుకొన్నా మీకు పునర్జన్మలు ఆగవు. మనం నేను, నేను అంటున్నాము కదా! ఆ నేను అనే తలంపు యొక్క మూలం తెలుసుకుంటే, ఆ నేను అనే తలంపును దాని మూలంలోనికి పంపగలిగితే ఇంక మీకు తెలుసుకోవలసినది అంటూ ఏమీ మిగలదు. అప్పుడు మీకు పునర్జన్మలేదు అని భగవాన్ చెప్పారు. ఈ వాక్యం చాలా బాగుంది. ఇప్పుడు మీకు జన్మలు రావు అని అనుకోకండి. మనలో బలహీనతలు ఉన్నంతసేపు, సంస్కారాలు ఉన్నంతసేపు, దేహాన్ని బంధించే విషయాలు ఉన్నంతసేపు మనకు జన్మలు వచ్చితీరతాయి. మాకు ఇంక జన్మలు రావు అని చెప్పటానికి గుర్తు ఏమైనా ఉందా అంటే బుద్ధుడు ఒకమాట చెప్పాడు. శరీరంలో ఏ అవయవం మనకు గుర్తుకు రాకపోతే మనం ఆరోగ్యంగా ఉన్నట్లు గుర్తు. పునర్జన్మ ఎవడికిరాదు అంటే శరీరం చనిపోయేటైములో, ఆ చివరిశ్వాసలో మీరు బాహ్యవిషయాలతో సంబంధం లేకుండా లోపల నూటికి నూరుపాళ్ళు సుఖంగా, శాంతిగా ఉండగలిగితే, అంటే స్వతంత్రమైన ఆనందం, స్వతంత్రమైన సుఖం, స్వతంత్రమైన శాంతి ఆ చివరిశ్వాసలో కనుక మీకు ఉంటే అప్పుడు మీకు పునర్జన్మ లేదు. మీ లోపల మనస్సులో ఉన్న మాలిన్యం ఎప్పడయితే పోయిందో, మనస్సు ఎప్పడయితే పరిశుద్ధం అయ్యిందో అప్పడు నువ్వు ఆనందంగా ఉండగలవు. లోపల మీకు ఉన్న బంధాలు,

మీకు ఉన్న విషయచింతనలు వేగంగా ఉన్నప్పుడు వాటి వేగాన్ని తట్టుకొని ఈ శరీరం ఉండగానే వాటిని బయటకులాగి కాల్చి బూడిద చెయ్యాలి అంటే మీకు ఈ శరీరం ఉండగానే చనిపోయి మరల అదే శరీరంలో పుట్టాలి. అప్పుడు మీకు జ్ఞానం కలుగుతుంది. గాంధీజీని కాల్చినప్పుడు ఆ చివరిశ్వాసలో 'హే రామ్' అన్నాడు. అంటే ఆయన లోపల రాముడు ఉన్నాడు. ఆయన జీవితం పొడుగునా రామభక్తి పోషించుకొన్నాడు. జీవితం పొడుగునా ఏ విషయం అయితే మనం స్మరిస్తున్నామో అదే మనకు మరణకాలంలో గుర్తుకు వస్తుంది. కాని జీవితం పొడుగునా ఒకటి స్మరించి మరణకాలంలో ఇంకోవస్తువు గుర్తుకురావాలంటే అలా రాదు. ఇది మీరు బాగా గుర్తుపెట్టుకోండి. దైవం మనకు మరణసమయంలో గుర్తుకు రాడు ఎందుచేతనంటే ఆయనతో మనకు మానసికఅనుబంధం లేదు.

నేను అనే తలంపు ఎక్కడ నుండి ఉదయించి వస్తోందో అది దాని మూలాన్ని అంటే దాని పుట్టుచోటును చూసిన వెంటనే అది నశిస్తుంది. అప్పుడు అక్కడ ఉన్న బ్రహ్మం నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. దీనినే మనం మోక్షం అంటాము. బుద్ధుడు నిర్వాణం అంటాడు. నిర్వాణం అంటే ఆరిపోవటం. కిరసనాయిలు దీపంలో కిరసనాయిలు అయిపోయాక వెంటనే ఆ దీపం ఎలా ఆరిపోతుందో అలాగే ఈ దేహం ఉండగా నీలో ఉన్న విషయవాసనలు అనే కిరోసిన్ ఎప్పుడైతే ఖర్చు అయిపోయిందో, భోగదృష్టి ఎప్పుడయితే నశించిందో అప్పుడు ఇంక నీకు శరీరం రాదు. అదే నిర్వాణపదవి. కిరసనాయిల్ అవ్వగానే దీపం ఆరిపోతుంది. కిరసనాయిల్ అవ్వకుండా దీపం ఆరదు. అలాగే మీలో ఉన్న భోగదృష్టి ఆరిపోయినా తరువాత మటుకే మీకు పునర్జన్మ రాదు కాని ఈ లోపుగా మీకు జన్మలు వస్తూనే ఉంటాయి. లోకవిషయాల పట్ల కొంత మంది అతిగా ఉంటారు. వారందరూ పిచ్చివాళ్ళు. మీరేదో కష్టసుఖాలు మాట్లాడుకొంటున్నారు అనుకోండి. మీరేమిటి చెప్పకొంటున్నారు అంటాడు. ఆ విషయాలతో వాడికి సంబంధం ఏమిటి? లోకవిషయాలపట్ల ఎక్కువ ఆసక్తి ఉన్న వారికి, ఈ లోకం ఒక్కటే నిజం, శరీరం ఒక్కటే నిజం, ఈ లోకానికి శరీరానికి అతీతంగా ఏమీలేదు. మనస్సుకు యింద్రియాలకు అతీతంగా , చావుపుట్టుకలకు అతీతంగా ఏమీలేదు అని ఎవడైతే అనుకొంటున్నాడో వాడికి ఎన్నటికీ జ్ఞానం రాదు. మన యింద్రియాలకు, బుద్ధికి అందని విషయాలు అనేకం ఉన్నాయి. అవన్నీ కూడా ఏమీ లేదు. ఈ శరీరం ఒక్కటే నిజం, ఈ లోకం ఒక్కటే నిజం, మన యింద్రియాలకు అనుభవంలో ఏవైతే ఉన్నాయో అవే నిజం యింకో నిజం అంటూ ఏమీ లేదు అని ఎవడయితే అనుకొంటున్నాడో వాడు ఎంత సాధన చేసినా కాని వాడికి జ్ఞానం లభ్యంకాదు. మీరు విశ్వాసపాత్రులుకాదు. అసలు బ్రహ్మపదార్థంయందు విశ్వాసం లేకుండా మనం దానిని

పొందలేము. మనకు వైరాగ్యం లేకుండా, వివేకం లేకుండా, చిత్తశుద్ధి లేకుండా బ్రహ్మమును ఆశించినా అది లభ్యంకాదు. మీకు ఎప్పుడయితే అర్హత వచ్చిందో, ఎప్పుడయితే యోగ్యత వచ్చిందో బ్రహ్మంనాకు తెలియబడాలి అని నీవు అనుకోనక్కరలేదు, దానంతట అదే తెలియబడుతుంది. బ్రహ్మం నీకు ఎప్పుడు తెలియబడాలో ఆ ముహూర్తం అదే పెట్టుకొంటుంది. నువ్వు దానికోసం ఎదురుచూడవద్దు. అది ఎప్పుడు జరగాలో అప్పుడు జరుగుతుంది. మనం కంగారుపడితే జరగదు. ఆ జరిగేది కూడా భగవంతుని సంకల్పాన్ని అనుసరించి జరుగుతుంది కాని నీ సంకల్పాన్ని అనుసరించి జరుగదు. అంటే అనుకొనేది మన సంకల్పం, జరిగేది ఈశ్వరసంకల్పం. దేవుడు ఉన్నాడా, లేడా అంటే బుద్ధుడు మౌనంగా ఉన్నాడు. ఉన్నాడని చెప్పలేదు, లేడని చెప్పలేదు. ఒక వ్యక్తిగా ఆయన దేవుడిని అంగీకరించలేదు కాని బ్రహ్మపదార్థాన్ని మటుకు ఆయన ఎప్పడూ కాదనలేదు. అది ఉంది కాని దానికి నామరూపాలు లేవు. బుద్ధుడు సాకారానికి విలువ ఇవ్వలేదు, నిరాకారానికే ఆయన విలువ ఇచ్చాడు. నిరాకారం ద్వారా తరించటం చాలా కష్టమైనది. నిరాకారంకంటే సాకారం కొంచెం తేలిక. సాకారం సుఖంగా ఉంటుంది. సుఖంగా ఉన్నదానిని పట్టుకొని వేలాడటం మంచిది. ఎవరో నిరాకారం ద్వారా తరించారని మీరు కూడా అలాగే ప్రయత్నం చేయకండి. మీకు ఉన్న పరిస్థితులు ఏమిటో, మీకు ఉన్నజ్ఞానం ఏమిటో అది మీరు అర్థంచేసుకొని ప్రవర్తించండి. ఇప్పుడు మీరు అందరూ సంసారం నడుపుతున్నారుకదా. సంసార పరిస్థితులు ఎలా ఉన్నాయి, మీకు ఏమి ఉంది, ఏమిలేదు అని ఆ పరిస్థితులను అర్థంచేసుకొని సంసారం నడుపుకొంటున్నారు కదా. ఈ జ్ఞానం విషయంలో కూడా అంతే.

నిన్న ఒక అమ్మాయి బెంగుళూరు నుండి వచ్చింది. వాళ్ళ అబ్బాయి నాలుగవ తరగతి చదువుతున్నాడు. ఆ అబ్బాయి తల్లి ఎప్పడయినా మా కేసట్లు వింటూ ఉంటుంది. వాడు రాత్రి చదువుకొని పడుకొనేముందు అమ్మా నాకు నిద్ర వస్తోంది, నిద్ర తొందరగా రావాలంటే ఆ స్వీట్‌వాయిస్ ఒకసారి వినిపించు నిద్రపోతాను అంటాడట. ఆ స్వీట్‌వాయిస్ నాకు ఒకసారి వినిపించు సరిపోతుంది వెంటనే నిద్ర వచ్చేస్తుంది అంటే స్వీట్‌వాయిస్ అని పేరు పెట్టాడు. నాలుగవ తరగతి చదువుకొనే పిల్లవాడు. ఆయన చెప్పేది నాకు తెలియకపోయినా అది వినటం వలన నాకు నిద్రవస్తోంది. అంతవరకూ ఉపయోగించుకొంటాను. నాకు నిద్రపోయేటైము అయింది అమ్మా ఆ స్వీట్‌వాయిస్ ఒకసారి వినిపించు అంటాడట. ఈ మాటలు అన్న పిల్లవాడు నాలుగవ తరగతి చదువుతున్నాడు. ఎవరో చెపితే వాడు అన్న మాటలు కాదు. వాడి హృదయంలో ఫీలయ్యి అన్నమాటలు. ఆ అబ్బాయి అన్నమాట మీకు ఎందుకు చెపుతున్నాను అంటే మీరు మాకు చేసే సన్మానాలకంటే ఆ అబ్బాయి మాట చాలా స్వీట్‌గా ఉంది. అది ఎక్కడో హృదయాంతరాళాల నుండి వచ్చింది కాబట్టి ఆ మాట నాకు

బాగా సంతృప్తిని ఇచ్చింది.

మీ లోపల ఏమైనా బలహీనతలు ఉంటే, దోషాలు ఉంటే వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయండి. కాలులో ముల్లు విరిగితే, అది పాలకొల్లులో విరిగిందా, జిన్నూరులో విరిగిందా అని ఆలోచించటం అనవసరం. ముందు ఆ ముల్లును తీసేసుకో. అలాగే నీకు ఉన్న బలహీనతలు ఏ జన్మనుండి వచ్చాయి అనే గొడవ వద్దు. నీలో ఆ బలహీనతలు ఉన్నాయి కాబట్టి వాటిని తొలగించుకోవటానికి మీ శక్తిని, మీ వివేకాన్ని ఉపయోగించుకోండి. వీటితోపాటు ఆ బలహీనతల నుండి మీరు బయట పడటానికి వైరాగ్యం కూడా అవసరం. మీరు చెప్పిన మాటలను కొంతమంది కాదంటున్నారు అని రామకృష్ణ పరమహంసగారితో అంటే ఆయన చెప్పిన సమాధానం చూడండి. అపూర్వం, అద్భుతం. ఆయన మూడవ తరగతి చదువుకొన్నాడు. ఎంత ప్రజ్ఞో చూడండి. అది కాలేజీలో చదువుకొంటే రాదు. అది భగవంతుడి అనుగ్రహం. నేను చెప్పిన మాటలను కాదని వారు ఏమి చేస్తున్నారు. వారు ప్రపంచంలో విషయాలను భోగించటం, నాలుగు రూపాయలు సంపాదించటం, జీవితాన్ని ఎంజాయ్ చెయ్యటం అంతే కదా వారు చేసేది. మీరు చెప్పిన మాటలు కొంతమందికి యిష్టం ఉండటంలేదు, కాదంటున్నారు అంటే సరే మంచిదే మరి వాళ్ళు చేసేది ఏమిటి. వారు ప్రపంచాన్ని పట్టుకొని వేలాడుతున్నారు. డబ్బుకూడా, సెక్స్‌కూడా తిరుగుతున్నారు కాని అంతకంటే వారు సాధించింది ఏమైనా ఉందా? పోనీ ప్రపంచానికి ఏమైనా ఉపయోగపడుతున్నారా అంటే వాళ్ళు ఏమీ ప్రపంచానికి ఉపయోగపడటంలేదు. వాళ్ళ భోగాలు అనుభవించటానికి టైమునంతా పాడుచేసుకొంటున్నారు. నేను చెప్పిన మాటలను కాదని వారు ఏమి సాధిస్తున్నారో వారినే చెప్పమనండి. దె ఆర్ బిజీ విత్ ది వరల్డ్, దె ఆర్ బిజీ విత్ ది మనీ, దె ఆర్ బిజీ విత్ ద ఫేమ్ అంతకంటే ఏమి చేస్తున్నారో చెప్పమనండి అంటున్నాడు రామకృష్ణుడు. నేను చెప్పే మాటలను కాదంటున్నారు రైటే వాళ్ళు చేసేది ఏమిటి? అసలు మంచి పనులు చెయ్యరు. పొరపాటున ఏదైనా మంచి పనిచేస్తే చేసేమంచి ఒక పైసా అయితే రూపాయి కీర్తి కావాలి, అంతకంటే వారు ఏమి చేస్తున్నారు. మాకు టైములేదు, చాలా బిజీగా ఉన్నాము అని కొంతమంది అంటారు. దేనిని సాధించటం కోసం బిజీగా ఉన్నారు, దేశసేవ చెయటానికి బిజీగా ఉన్నారా, బ్రాహ్మీస్థితిని పొందటానికి బిజీగా ఉన్నారా, దేనికోసం మీరు బిజీగా ఉంటున్నారు. అది చూసుకోండి. సందేహాలు పెట్టుకోవద్దు. భగవంతుడు ఉన్నాడా, లేడా అని సంశయం పెట్టుకోవద్దు. ఉన్నాడా లేడా అనే విషయంలో రోజుకోరకంగా మీరు తయారవుతున్నారు. ఒకరోజున విశ్వాసం ఉంటుంది. రెండోరోజున విశ్వాసం నిలబడదు. దానికో నిదానం లేదు. అందుచేత మీరు సంశయాలు పెట్టుకోవద్దు. సందేహాలు ఉంటే తొలగించుకోండి. తన సందేహాలను

టీచర్‌ను అడిగి ఎవడయితే తొలగించుకొంటున్నాడో ఆ సబ్జక్టులో వాడు అభివృద్ధిలోనికి వస్తాడు. సందేహాలను లోపల పెట్టుకొని నలిగిపోవటం కంటే మీరు టీచర్‌ను అడిగి ఆ సందేహాలను తొలగించుకోవటానికి ప్రయత్నం చేయాలి. ఒకవేళ బ్రహ్మం ఉందా, లేదా అని మీకు అనుమానం వస్తూఉంటే గురువును ఆశ్రయించి ఆ సందేహాన్ని తొలగించుకోండి. అంతేగాని ఏవో సందేహాలు పెట్టుకొని మీరు లోపల కాలిపోవద్దు. మీ మనస్సు ఎప్పడూ అదుపులో ఉండాలి. మీ మనస్సు మీరు చెప్పిన మాట వినాలి. మీ యింద్రియాలు మీరు చెప్పినట్లు వింటూఉండాలి. మీరు ఎంతసేపు మీ క్షేమాన్ని కోరుకొంటున్నారు. ఇతరుల క్షేమం గొడవ మీకు లేదు. దేశానికి సేవ చేయనక్కరలేదు. కనీసం మీ కుటుంబసభ్యులు ఎలా ఉన్నారు అనే ఆలోచన కూడా మీకు లేదు. అటువంటి నీకు ఆత్మజ్ఞానం కావాలా? ఎలా కలుగుతుంది. ఉపనిషత్‌లో ఏమని ఉంది అంటే నీ కుటుంబం యొక్క క్షేమం కోసం నీ క్షేమాన్ని విడిచిపెట్టాలి. గ్రామం యొక్క క్షేమం కోసం నీ కుటుంబం యొక్క క్షేమం విడిచిపెట్టు. దేశం యొక్క క్షేమం కోసం నీ గ్రామాన్ని త్యాగం చెయ్యి. ప్రపంచం బాగుపడటం కోసం నీ దేశం అడ్డు వస్తూంటే నీ దేశాన్ని త్యాగం చెయ్యి. ఒకవేళ నువ్వు ఆత్మజ్ఞానం సంపాదించటానికి, బ్రాహ్మీస్థితిని పొందటానికి ఈ ప్రపంచం కనుక అడ్డు వస్తూఉంటే, ఈ సృష్టినీకు అడ్డు వస్తూఉంటే దానిని కూడా తొలగించి అవతల పాడేయి. ఎంత శాక్రిఫైసో చూడండి. కొంతమంది వాళ్ళు దేశానికి సేవ చేయనక్కరలేదు, కనీసం వారి కుటుంబసభ్యులు ఎలా ఉన్నారు, వారు తిన్నారా లేదా అని కూడా చూసుకోరు. ఎంతసేపు వాడి పొట్టగొడవ తప్ప వేరే గొడవ వారికి ఉండదు. అటువంటి వారు బ్రహ్మజ్ఞానం ఆశిస్తే వారికి జ్ఞానం ఎలా కలుగుతుంది. అంత స్వార్థపరులు, అంత యోగ్యత లేనివారు బ్రహ్మజ్ఞానం గురించి ఆశించినా అది వాడికి సాధ్యంకాదు. ఎదుటివారు పాడయిపోవాలని ఎప్పడూ అనుకోవద్దు. వారు మీకు విరోధులు అయినా వారు పాడైపోవాలని ఎప్పడూ కోరుకోవద్దు. ఎదుటి వారు పాడైపోవాలని మీరు అనుకొంటే దానివలన మీ మనస్సు పాడైపోతుంది. ఏ మనిషీ పాడయిపోవాలని మీరు కోరుకోవద్దు. వారు క్షేమంగా ఉండాలని, వారు అభివృద్ధిలోనికి రావాలని, వారు సుఖంగా ఉండాలని మీరు ఎప్పడూ కోరుకోండి. వాడు దుఃఖపడాలని ఎప్పడూ మీరు అనుకోవద్దు. వాడు ఎప్పడూ సుఖంగా ఉండాలని అనుకోండి.

**కామక్రోధ వియుక్తానాం యతీనాం యతచేతసామ్**
**అభితో బ్రహ్మనిర్వాణం వర్తతే విదితాత్మనామ్**

మీకు ఎక్కువగా కోపం వస్తూఉంటే మీ బుద్ధి పాడైపోతుంది. మాట మాటకు కోపం వస్తూఉంటే చివరకు పిచ్చివాళ్ళు అయిపోతారు. నీ బుద్ధిలో ఉన్న దోషాలనుండి బుద్ధిని విడుదలచెయ్యి. మనస్సును కంట్రోలులో పెట్టుకో. బయటమనుషులతో ఎలా

విరోధాలు పెట్టుకొంటున్నారో అలా మనస్సుతో విరోధం పెట్టుకోవద్దు. నీ మనస్సుతో స్నేహంగా ఉండు. నీ మనస్సు నీకు స్నేహితుడిగా ఉంటే మీ బంధువులు ఎవరూ చేయలేని ఉపకారం నీ మనస్సు నీకు చేసిపెడుతుంది. శరీరానికి ఆరోగ్యం అవసరం, మనస్సుకు నిగ్రహం అవసరం. ఇప్పుడు చెప్పినటువంటి దైవీసంపద కనుక మీకు ఉంటే, మీరు అందరి క్షేమం కోరుకుంటూ ఉంటే కాలక్రమంలో మీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. మీకు ఆత్మజ్ఞానం కలిగినప్పుడు ఈ శరీరం ఉన్నా లేకపోయినా, ఈ ప్రపంచం మీ కళ్లకు కనిపిస్తున్నా, కనిపించకపోయినా ఈ లోకంతో సంబంధం లేకుండా, మీ మనోదేహములతో సంబంధం లేకుండా మీరు సర్వత్రా ఎటుచూసినా మోక్షసుఖాన్ని అనుభవిస్తారు. అటువంటిస్థితిని పొందటానికి ప్రయత్నం చేయండి. మీరు అవసరమైతే మాట చెప్పాలి అంతేగాని అహంభావనకోసం మాట్లాడకూడదు. అవసరం లేకుండా మనం మాటలు చెపుతూ ఉంటే మనకు దేహాత్మబుద్ధి పెరిగిపోతుంది.

మాట, చేత, మనస్సు వీటిని త్రికరణములు అంటారు. మనకు మంచి తెచ్చిన, చెడ్డ తెచ్చిన ఈ మూడే. మనస్సు, మాట, చేత ఒకటిగా ఉంటే వాడిని ఈశ్వరానుగ్రహం వరిస్తుంది. ఈ మూడూ ఒకటిగా ఉన్నవాడిని ఈశ్వరుడే తీసుకొంటాడు. ఆయన ఎక్కడ ఉన్నాడో మనకు తెలియదు కాని మనం ఎక్కడ ఉన్నామో ఆయనకు తెలుసు. త్రికరణశుద్ధి ఉన్నవాడి శిరస్సుమీద ఈశ్వరుని దయ వర్షిస్తుంది. ఈశ్వరానుగ్రహం లేకుండా ఆత్మజ్ఞానం పొందటం ఎవడికీ సాధ్యంకాదు. అయితే ఈశ్వరానుగ్రహం మనకు ఎప్పుడు కలుగుతుంది అంటే మన మనస్సు, మాట, చేత ఈ మూడూ ఒకటిగా ఉన్నప్పుడు ఈశ్వరుని దయకు నువ్వు పాత్రుడవు అవుతావు.

సామాజిక స్పృహ ఉన్నవారికి కూడా భగవంతుడు ఆధ్యాత్మికంగా కొన్ని మార్కులు వేస్తాడు. ఎందుచేతనంటే ఈ ప్రపంచరూపంలో, సమాజరూపంలో ఉన్నవాడు భగవంతుడే. అందుచేత నువ్వు సమాజానికి ఎంతవరకూ ఉపయోగపడుతున్నావో అంతవరకు భగవంతుడికి సహాయపడినట్లు అవుతుంది, విష్ణుసహస్రనామాలలో మొదటి శబ్ధం విశ్వం. విశ్వం అంటే ప్రపంచం. మహావిష్ణువు విశ్వరూపంలో, ప్రపంచరూపంలో ఉన్నాడని అర్థం. ఈ సమాజరూపంలో ఉన్నవాడు కూడా ఆయనే. అందుచేత నువ్వు సమాజానికి నిష్కామంగా, స్వార్థం లేకుండా పని చెయ్యి. అప్పుడు నీ మనస్సు పవిత్రమవుతుంది, నిర్మల మవుతుంది. మనం ఎవరికైనా పదిపైసలు ఇచ్చాము అనుకోండి, వాడికి పది పైసలు ఇచ్చాము అని అనుకొంటాము. అది కరెక్టు కాదు. పదిపైసలు ఇవ్వటానికి వాడు మనకు అవకాశం ఇచ్చాడు. వాడు తీసుకోకపోతే మనం ఇవ్వలేముకదా! అందుచేత మనం ఇవ్వటానికి వాడు అవకాశం ఇచ్చాడు. అవకాశం ఇచ్చినందుకు వాడికి మనం కృతజ్ఞత

చెప్పాలి. ఆ రకమైన భావనతో మనం పనిచేస్తే ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతాము. మనిషిని తమోగుణం, రజోగుణం, సత్వగుణం ఈ మూడు గుణాలు పట్టుకొని వేలాడుతూ ఉంటాయి. సత్వగుణం అందరికీ ఉండదు. సత్వగుణం ఉన్నవాడు మాట్లాడుతూ ఉంటే మనకు వినబుద్ధి వేస్తుంది. ఆ మాట యొక్క ప్రభావం మనమీద ఉంటుంది. అదేమాటను రజోగుణం ఉన్నవాడు, తమోగుణం ఉన్నవాడు మాట్లాడినా, ఆ మాటలు మనం వింటున్నా ఆ మాట యొక్క ప్రభావం మనమీద ఉండదు. మనం సత్వగుణాన్ని పెంచుకోవాలి. సత్వగుణాన్ని ఎవడైతే పెంచి పోషించుకొంటున్నాడో వాడికి దైవీచింతన పెరుగుతుంది, వాడికి తొందరగా భగవదనుభవం కలుగుతుంది. ఎందుచేతనంటే భగవంతుడిని చేరుకోవటానికి సత్వగుణం ఒక రోడ్డువంటిది, అంటే మనకు మార్గం చూపిస్తుంది. అందుచేత సత్వగుణం వచ్చినప్పుడు దానిని ప్రాక్టీసు చేసి అది ఎక్కువకాలం మన మనస్సులో ఉండేటట్లు చూసుకోవాలి.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 20-09-2014, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఇతరులు సుఖంగా ఉండటంకోసం ప్రయత్నం చేస్తూ ఉంటే నీకు చాలా సుఖం వస్తుందని మెహర్‌బాబా చెప్పారు. దానివలన నీకు పుణ్యంవస్తుంది కాని జ్ఞానం రాదు. వారు ఇతరులు అనే భావన నీకు ఉంటుంది కదా! దానివలన లోపల చెద పుడుతుంది అంటే లోపల అహంకారం పెరుగుతుంది. సాధన చేస్తూ ఉంటే మనం శాంతిని పొందటానికి ఏవి అడ్డువస్తున్నాయో తెలుస్తోంది అని ఒక భక్తుడు అంటే తెలిస్తే సరిపోదుకదా, వాటిని పోగొట్టుకోవటానికి మీరు ప్రయత్నం చేయాలి. ఒకవేళ మీరు ప్రయత్నం చేస్తున్నా దానితోపాటు గురువు కృప ఉంటేగాని అవి పోవు. ప్రతీ చిన్న సంఘటన దేహం యొక్క ప్రారబ్ధంననుసరించి నడుస్తోంది. భగవాన్ దగ్గర మాధవస్వామి అని ఒక భక్తుడు ఉండేవాడు. ఆయనకు పీఠాధిపతి అవ్వాలని లోపల కోరిక ఉండేది. ఒకసారి కుంభకోణం పీఠాధిపతి సరస్వతీస్వామి భగవాన్ దగ్గరకు వచ్చి ఇక్కడ కొంతకాలం ఉంటాను అని భగవాన్‌తో అన్నారు. అప్పుడు మాధవస్వామి కుంభకోణం వెళ్ళి అక్కడ పీఠాధిపతి చేసాడు. కొంతకాలం తరువాత మాధవస్వామి అక్కడ చనిపోయాడు, ఈయన ఇక్కడ చనిపోయాడు. వాడి కోరిక నెరవేరింది, వీడి కోరిక నెరవేరింది అన్నారు భగవాన్. నీ దేహప్రారబ్ధంలో ధనవంతుడు అవ్వాలని ఉంటే అయిపోతావు. ఇవి అన్నీ బాహ్యగొడవలు. మలేషియాలో ఉద్యోగం చేస్తున్న ఒక అబ్బాయి ఈ రోజున నన్ను చూడటానికి వచ్చాడు. మీ తాతయ్యను చూసి వచ్చావా అని అడిగాను. తాతయ్యకు ఫోన్‌చేసాను. తాతయ్యతో ఫోన్‌లో మాట్లాడితే సరిపోతుంది, ఇక్కడకు వచ్చి మిమ్మల్ని చూస్తే సంతృప్తి అవుతుంది అనుకొన్నాను అని చెప్పాడు. అరగంట ఇక్కడ కూర్చున్నాడు, వెళ్ళిపోయాడు. అతడిని ఎవడు